

# ‘నేను

ఎవరితోను లేచిపోను,
ఇద్దరితోను కలసి
కాపురం చేస్తాను’
స్థిరంగా అనుకుంది
ఆమె మనసులో.

‘ఖయాలోంమే’ అంటూ మైథిలి పడుతున్న అలజడిలోకి దూసుకువచ్చాడు గణపతి.

‘బెంగగా ఉందోయ్’

‘ఎవరి మీదేంటి. అతని మీదేనా. ఎదురుగా నాలాంటి ప్రియుడ్ని పెట్టుకుని, భర్త మీదేమిటి అలా ధ్యానం’ అంటూ అలిగేశాడు.

అంతరంగంలో అల్లరి, ఉద్వేగం, ఉత్సాహం, ఉద్రేకం నింపుకున్న సుడి

# నిర్మోహమ్

-చైత్ర

గాలి మైథిలి. ఆ విషయం అతనికి బాగా తెలుసు. ఎక్కడ ఆ గాలి భర్తమీదకి మాత్రమే మళ్ళుతుందనే భయం.

కనిపించని కోపం.

తనతో రాదేమోనన్న దిగులు.

'ఏమెవరి తాలూకా' ఆవులించుకుంటూ అడిగాడు అపార్ట్‌మెంట్ గేట్ దగ్గర మంచున్న వ్యక్తి. చిరాగ్గా, అసహ్యంగా చూసింది మైథిలి. కాళ్ళు బారజావుకుని, చేతులు ఫెడీల్మని విరుచుకుంటోన్న అతన్ని చూస్తే చాచి చెంపదెబ్బ కొట్టాలన్నంత ఆవేశం వచ్చిందామెకు.

'ఏం ఎవరి తాలూకా చెప్పకపోతే గణపతిగారి ఫ్లాట్ నెంబరు చెప్పరా' అంది తమాయించుకుంటూ! ఆమె విసుగుని చూసి కాస్త షాకయ్యాడా వ్యక్తి. ఏదో చెప్పబోయాడు. అతన్ని లెక్కచేయకుండా ఫ్లాట్ వెతుక్కోవడానికి మెట్లెక్కిందామె. గణపతి కోసం అతని ఫ్లాట్‌కి రావడం అదే రెండోసారి. అతని పుట్టిన రోజు విషెస్ చెప్దామని వచ్చిన మైథిలిని గేటు దగ్గర సంఘటన కాస్త కలవరపెట్టింది. తలవు మీద 'గణపతి' అన్న పేరు చూసి కాలింగ్ బెల్ నొక్కింది.

అప్పుడే స్నానం చేసిన గణపతి అచ్ఛాదన లేని ఛాతితో వచ్చి తలుపుతీశాడు. 'హాయ్... నీ కోసమే ఎదురుచూస్తున్నా' సంతోషంగా అన్నాడు. అతడ్ని విష్ చేయకుండా వెళ్ళి కుర్చీలో కూలబడింది. ఆమె రెస్ట్‌లెస్‌గా ఉందని గమనించాడు గణపతి. టీ తెస్తానని లోపలికి వెళ్ళాడు.

టీ పెడ్తున్న అతన్ని వెనకి నుండి గట్టిగా కౌగిలించుకుంది మైథిలి. విశాలంగా, ధృడంగా, పొగరుగా కనిపించే అతని ఛాతి అంటే చచ్చేంత ఇష్టం ఆమెకు. 'హాపీ బర్త్‌డే టుయు' అని వీపుమీద ముద్దు పెట్టుకుంది. 'ఒక్క క్షణం రా' వచ్చేస్తున్నా అని టీని కప్పులో పోశాడు గణపతి.

'ఏరా అంత రెస్ట్‌లెస్‌గా ఉన్నావ్' తన ఛాతీతో అదుకుంటున్న మైథిలిని అడిగాడు. ఆడవాళ్ళకు మొగుడో, అయ్యో, అన్నయ్యో ఫలానావారి తాలూకా ఉండాల్సిందేనా వాళ్ళెవరి 'తాలుకానో' చెప్పకపోతే బ్రతకనివ్వరా, పని జరగదా అంది ఫ్రస్ట్రేటెడ్‌గా.

'ఇప్పుడు ఏమైంది' అన్నాడు గణపతి.

అంతకు ముందు జరిగిన సంఘటన చెప్పకొచ్చిందామె. గణపతి కాసేపు మౌనంగా ఉండిపోయాడు.

'అన్నింటినీ అంత సీరియస్‌గా, సెన్సిటివ్‌గా తీసుకుంటావెందుకు. వాడు అడిగిన తీరు బావుండలేదేమో కాని అలా అడగడం అరుదేం కాదే' అన్నాడు. ఆ మాటలకు అతన్ని దూరంగా తోసేసింది.

ఆమె మూడ్ బాగోలేదని గ్రహించాడు.

'మైథిలి ఈ మధ్య మామూలుగా వుండటం లేదు. అదోలా ఉంటున్నావు' అన్నాడు ఆమెను హత్తుకుంటూ.

'రాజు సరిగా ఇంటికి రావడంలేదు.'

ఆమె మెడ కింద అతడి పెదవుల కితకితలు.

'ఎందుకో' అన్నాడు గణపతి ఆమె కనుబొమ్మలు స్పృశిస్తూ.

'నేను నీతో ప్రేమలో పడ్డానని రాజుకు తెలుసు' ఆ మాటలకు ఆమెను వదిలేశాడు గణపతి.

'తెలిస్తే' (నీ వైఖరి ఏంటి అన్నట్టు) అడిగాడు గణపతి.

'ఏమీ కాదు' అందామె నిర్వికారంగా, నిబ్బరంగా.

'నువ్వు రోజూ నన్ను చూడటానికి ఇంటికి వస్తావని తెలుసు. నన్ను ఏమీ అనలేదు. పైగా మనల్ని డిస్టర్బ్ చేయడం ఎందుకని రాకపోతుండచ్చు.

'అతను ఇంటికి రావడం లేదని నువ్వు బెంగపెట్టుకున్నావ్. నన్ను అసలు పట్టించుకోవడం లేదు' అన్నాడు కొంచెం క్రోధం నిండిన గొంతుతో.


ఆ మాటలకు ఆమె పెదవులపై చిరునవ్వు పూదోటలా విరిసిందంతే అతన్ని దగ్గరగా తీసుకుంది.

'మైథిలి నేను నీకు ఒక విషయం క్లియర్‌గా చెప్పదల్చుకున్నాను. నీకు పెళ్ళి కావడం నేను నిన్ను ప్రేమించడానికి అడ్డంకాదు. నా ప్రేమ నిజం. విడాకులిచ్చి అయినా, విడాకులివ్వకపోయినా నువ్వు నాతో వచ్చేయాలి. నాతోనే ప్రేమ. అంతే'

'నాకు పెళ్ళి కావడం నన్ను ప్రేమించడానికి నీకు అడ్డం కాదు. సరే ఆ విషయం చాలా గొప్పదైనట్టు చెబుతున్నావ్' అంది అతని వంక తేరిపార చూస్తూ.

'మైథిలి ఎంతమందినైనా ప్రేమించవచ్చు. ఒక సమయంలో ఒక వ్యక్తినే ప్రేమించగలదు స్త్రీ. అత నికే కట్టుబడి ఉంటుందామె' అన్నాడు గణపతి.

'చిత్రంగా మాట్లాడతావే' అంది మైథిలి.




* * *

గణపతితో కాసేపు ప్రేమలో ఓలలాడి ఇంటికి వచ్చాక ఆమె ఆలోచనల్లో మునిగిపోయింది. రాజుతో ఆమె వివాహం ఎనిమిది నెలలది. గణపతితో ప్రణయం మూడు నెలలది.

'అసలు నేనెందుకు పెళ్ళి చేసుకున్నాను. రాజు అంటే నాకు ఇప్పుడు, అప్పుడు, ఎప్పుడూ ప్రేమే. అలా ప్రేమించవచ్చు. 'పెళ్ళి' అనే అధికారిక సంబంధంలోకి ఎందుకు ప్రవేశించాలి' ఆమెలో ప్రశ్నల పరంపరతో సాయంత్రం ఆరుగంటలు దాటిపోయింది.

* * *

గుప్పెడు వెన్నెల పూశాడు చంద్రుడు. రాజు కోసం ఎదురుచూస్తూ బాల్కనీలో

నించుంది. అప్పుడే స్నానం చేసింది. చల్లగాలిని ఆమె గుండెల నిండా పీల్చుకుంటుంటే ఆమె ముంగురులు గాలితో ఆడుకుంటున్నాయి. రాజు స్పర్శకు తలతిప్పి చూసింది. అతన్ని చూసిన సంతోషమంతా మందహాసంలో తొంగిచూసింది.

మాసిన గడ్డంతో దిగాలుగా వున్నాడు రాజు. కాస్త అమాయకంగా, సున్నితంగా బేలగా కనిపించే రాజంటే ప్రాణం ఆమెకు. 'ఏమైపోతున్నావ్ రాజూ' అంది తల నిమురుతూ. ఆమె ఉనికి, స్పర్శ హాయిగా ఉన్నా, దాన్ని బయటకు ప్రదర్శించడానికి ఇబ్బందిపడ్డాడు.

'ఏం లేదు' అన్నాడు ముభావంగా. అతడి బాధ ఏమిటో మైథిలికి స్పష్టంగా తెలుసు.

'పద అన్నం తిందువుగానీ' అంది.

అతను ఏదో మాట్లాడాలనుకుని ఇబ్బంది పడుతున్నాడని గ్రహించింది. 'రాజు నాతో ఏదైనా మాట్లాడాలనుకుంటున్నావా అంది' కళ్ళలోకి చూస్తూ. అతను 'ఊ.' అని మళ్ళీ వెంటనే ఏం లేదన్నాడు.

'ఫర్వాలేదు చెప్ప, అయాం ఓపెన్ టు ఎవిరిథింగ్. నా దగ్గర నీకు తెలీంది ఏముంది.'

'మైథిలి మనం ఎంతగానో ఇష్టపడి, అందర్నీ కాదనుకుని పెళ్ళి చేసుకున్నాం. అయినా నేను నన్నే ప్రేమించమని అడగడం లేదు. అడగను కూడా. నీ కిష్టమైతే అతనితో వెళ్ళిపో. ఆ తరువాత మనం కలుసుకోం' అన్నాడు ముక్తసరిగా.

మైథిలి తలదించుకుంది. సాలోచనగా అతని వైపు చూసింది. 'రాజు స్త్రీకి తనకినచ్చిన వాడితో బ్రతికే హక్కు వుంది. అయితే ఒక సమయంలో ఒకరినే. ఒక మగాడి దగ్గర సెలవు పుచ్చుకున్నాకే ఇంకొకరిని ప్రేమించాలనేగా నువ్వనేది'

'ఇద్దరితో ఎలా కుదురుతుంది మైథిలి'

'ఎందుకు కుదరదు. నేను ప్రేమిస్తున్నాగా. అది అబద్ధం కాదు.'

'బాగా ఆలోచించుకో' అన్నాడు రాజు పొడిగా.

* * *

ఆరోజు ఆదివారం.

రాజు, మైథిలి ముభావంగా ఎవరి పని వారు చేసుకుంటున్నారు. ఫోన్ మోగింది. మైథిలి 'హలో' అంది.

'మైథిలీ ఇంతకీ ఏం డిసైడ్ చేసుకున్నావ్' అవతలివైపు నుండి గణపతి ఫ్రస్ట్రేటెడ్‌గా అడుగుతున్నాడు. మైథిలి చిన్నగా నిట్టూర్చింది.

'నేను మీ ఇద్దరిలో ఎవ్వరితోను కాపురం చేయడంలేదు గణపతి' అంది, అక్కడే వున్న రాజును క్రీగంట చూస్తూ.

చురుకైన బుర్ర, పరిమళించే మనసు, సౌష్ఠవమైన దేహమున్న మెరుపులా కనిపించే ఆమె మాటలకు ఉలిక్కిపడ్డాడు రాజు.

'నేను ప్రేమించిన వాళ్ళనెవర్నీ నేను కోల్పోను. ఎందరినైనా ప్రేమించవచ్చు. కాని ఏకకాలంలో ఒకే వ్యక్తితో కట్టుబడి ఉండాలనడం కూడా పాతివ్రత్యమే. నేనెవరికీ బందీని కాను. ఇలా ఒకరితో అధికారికంగా, మరొకరితో రహస్యంగా ప్రేమ నాకు వచ్చదు. నాకంటూ ఒక స్వంత ఇల్లు వుంటుంది. నాతో అనధికారికంగా కలసి వుండే ధైర్యముంటే రండి లేదా నా ఇంటికి వచ్చి ప్రేమను తీసుకుపోతుండండి.'




# విశ్వదర్శనం

## [భారతీయ చింతన వ్యాసావళి]

## 28-6-96 సంచిక నుంచి

# పునఃప్రారంభం



వేద యుగం నుంచి ఆధునిక కాలం వరకు భారతీయుల జీవన విధానాన్ని, ఆలోచనాధోరణులను ప్రభావితం చేసిన వివిధతాత్విక సిద్ధాంతాల దిగ్దర్శనంగా సాగిన విశ్వదర్శనం (భారతీయ చింతన) వ్యాసావళి స్వామి వివేకానందతో ''ఆంధ్రజ్యోతి'' సచిత్ర వార పత్రికలో 28-6-96 సంచిక నుంచి పునర్దర్శనం

**రచన: నండూరి రామమోహనరావు**